

# స్వయంవరం


## లేఖకుడు 'పరశురాం'

అనువాదకులు. చక్రపాణి.

“రాత్రి తొమ్మిది ఘంటల యాభై యేడు నిముషాలకు అంబు వాచీ నివృత్తి. యీలోపల వాన వెలియదు. యిప్పుడు యింకా సాయంత్రమే.” చటర్జీ మహాశయుడు పంచాంగం చూచి సెలవిచ్చాడు.—“అయితే చాల యిబ్బందే, యింటి కెట్లా వెళ్తాము” వినోదవకీ లన్నాడు.

—“ముందు వర్షం వెలవనీయండి, తర్వాత యింటి సంగతి ఆలోచించొచ్చు; ప్రస్తుతం యిక్కడే భోజనానికి ఏర్పాటు చేయిస్తా, ఊదో, కాస్తయింట్లోకి పోయి చెప్పిరా, పో” యింట యజమాని వంశలోచన బాబు అన్నాడు.

“ముసూరుపప్పుపులగం, యివిసీ చేప కూర”, చటర్జీగారు ఆర్డరు యిచ్చారు.



“దూరాన్నుండి అనేకమంది దొరసాన్లను చూచాను కాని—యింత ముఖాముఖిగా చూడడం నాకెప్పుడు తటస్థపడలేదు.'' (13 వ పేజీ)

(*)

“సరే యిదయింది. యిక కాలం ఎట్లా గడుస్తుంది? చటర్జీగారూ! ఏదన్నా కథ చెప్పండి” వినోదబాబు దిండు తనవైపు లాక్కుంటూ అన్నాడు.

చటర్జీగారు కొంచెం సేపటివరకు ఆలోచిస్తూ వుండి, తర్వాత చెప్పసాగాడు—“క్రిందటి సంవత్సరం నేను ముంగేరులో వుంటూ వుండగా ఒక ఆడుపులి పాలిట పడ్డాను.”

వినోదబాబు మధ్యలోనే ఆపుతూ అన్నాడు—“సలామ్ చటర్జీగారూ, పులికథ మాత్రం వినిపించ వద్దండి.”

—“అయితే ఏం చెప్పేది? భూతానిదా?” చటర్జీ కొంచెం కోపంతో అన్నాడు.

—"యీ వానలో పులి, భూతం ఏమిటీ చెల్లవు. ఏదైనా యింపైన ప్రేమకథ వినిపించండి."

—"నేనేం కథలు చెప్పేవాణ్ణి కాను. నేను చెప్పేదంతా నిజంగా జరిగిందే"

—"పోనీ, అదే వినిపించండి."

—"ఏడ్చినట్టేవుంది. చటర్జీగారు ప్రేమకథ చెప్తాడు, మనం వింటాము!—తమ ప్రాయ మెంతండి చటర్జీగారూ? నోట్లో పళ్లింకా ఎన్ని దిగుబడివున్నై?" నరేంద్రుడు ప్రశ్న వేశాడు.

—"ప్రేమ పళ్లతోనమలి తినే వస్తువా, ఏం? ఆరే పశువా, పళ్లల్లో వుండదు ప్రేమ, హృదయంలో వుంటుంది!"

—"మనస్సుకూడా ఎండి కాష్టమైపోయింది. ప్రేమంటే మీ కేమి తెలుస్తుంది? అంతా మరచిపోయి వుండొచ్చు. ప్రేమవిషయం కావాలంటే యువకుల్ని అడగండి. ఏం భా యీ వుదయ్"-నరేంద్రుడన్నాడు.

—"యువకులంటే ఎవరు? తిన్నగా ఎందుకు చెప్పవు?-'కుర్రకుంకలను, కుర్రకుంకలు.' మూడు యిరవైలు గడిచినై-కేదారచటర్జీకి ప్రేమ విషయమేమీ తెలియదు, మీ రెరుగుదురు-తిండిపోతు వెధవలు"

—"పోనివ్వండి. ఎందుకు బ్రాహ్మణ్ణి వృధాగా వేధిస్తారు-వినరాదూ సంగతేమిటో" వినోదుడు అన్నాడు.

చటర్జీ చెప్పసాగాడు—"వర్ణాల్లో శ్రేష్టులు బ్రాహ్మలు. ఉపనిషత్తులుగానీ, కావ్యాలు కానీ, ప్రేమతత్వం కానీ అన్నీ యీ బ్రాహ్మల బుర్రల్లోంచే వచ్చినై. బ్రాహ్మల్లో శ్రేష్టులు చటర్జీలు. బంకిమచటర్జీ, శరత్ చటర్జీ"

—"యింకా?"

—"యింకా యీ కేదారచటర్జీ ఎందుకు చెప్పనూ? నీవంటే భయమా!"

—"సరే, పోనివ్వండి, మీరు కథ మొదలెట్టండి"

చటర్జీ చెప్ప మొదలెట్టాడు—"గత సంవత్సరం విషయం నేనొక అనుపమ సుందరిపాలిట పడ్డాను."

—"యింతకు ముందేగా మీరు చెప్పింది పులిపాలిట పడ్డానని?" నగేంద్రుడు కుంటిప్రశ్న వేశాడు.

—"రెండూ ఒకటే" వినోదు డన్నాడు.

—"అరే మూర్హా! పులిపాలిట పడింది ముంగేరులో; మరి యీ ప్రసంగం పంజాబు మెయిలులో, టూండలాకు యివతల-సరే, కథవినండి!" చటర్జీగారు చెప్పసాగారు.

గడచిన వత్సరం మాఘ మాసంలో చరణఘోష తన చిన్నమ్మాయిని టూండలా తీసుకెళ్లమని కోరాడు—ఆయన అల్లుడు అక్కడే పని చేస్తున్నాడు. యితరుల ఖర్చుతో సెకండుక్లాసులో ప్రయాణం చేయటం, వచ్చేటప్పుడు ఒక రోజు కాశీలో కూడ వుండొచ్చు—అంతా వీలుగానే వుంది. పిల్లను నిర్విఘ్నంగా చేర్చాను. వచ్చేటప్పుడు టూండలా స్టేషనులో చూద్దునుగదా- బండిలో సూదిమోపటానికి కూడ సందులేదు. ఆగ్రానుంచి తిరిగివచ్చే అమెరికను యాత్రికులంతా ఫస్టు- సెకండుక్లాసు సీట్లన్నీ ఆక్రమించుకొని కూర్చున్నారు. అదృష్టంచేత ఘోషు అల్లుడు రైల్వే డాక్టరు. గార్డుతో చెప్పి నన్ను ఏదో విధంగా ఫస్టుక్లాసులో యిరికించాడు. బండికూడ వెంటనే కదలింది.

దాదాపు ఏడుఘంటలు కావచ్చు. పొగమంచు దట్టంగా పట్టటంచేత బండివెలపల సరేకదా—బండిలో కూడ బాగా కనబడటం లేదు. కాసేపు అట్లాగే కళ్ళు చీకురించుకొంటూ నిలబడి వున్నాను. తర్వాత నెమ్మది నెమ్మదిగా కొంచెం కనపడ సాగింది.

చూడగానే ఆశ్చర్యపోయాను. అవతల బెంచీ మీద ఆజానుబాహుడైన దొర నోరుతెరుచుకొని, కళ్లు మూసికొని వెల్లికిలగా, రాక్షసివలె పండుకొని వున్నాడు—మధ్య మధ్యఏదో గొణుక్కొంటూ. రెండు బెంచీల మధ్యనున్న కాళీలో పొట్టిగా, లావుగా, పీపాలావున్న దొర బోర్లగా పడివున్నాడు. వాడి తల దగ్గర ఖాళీ బుడ్డి ఒకటి దొర్లుతూ వుంది. యివతల బెంచిమీద ఎవ్వరూ లేరు. కాని దానిమీద మంచి విలువగల "బెడ్" వేసి వుంది. విచిత్రమైన దుస్తులు కూడ పడి వున్నవి—బహుశ వెలుగుబంటుతోలువి కావచ్చు—యింకా అనేక వస్తువులు చిందర వందరగా

పడివున్నవి. బండి నడుస్తూనే వుంది, పారిపోడానికి మార్గం కూడ లేదు. ఆ సీటులోనే కుర్చీమాదిరిగా ఒక అర వున్నది. దానిమీద కూర్చొని దుర్గానామం, జపించ సాగాను. ఏదో విధంగా కాలం జరిగిపోతున్నది. దొర లిద్దరు పండుకొనే వున్నారు. నాకూ కొంచెం కొంచెం ధైర్యం రాసాగింది.

హఠాత్తుగా బాత్ రూమ్ తలుపు తెరువబడింది. అందులోంచి సాటిలేని సుందరి ఒకతె బైటకు వచ్చింది. దూరాన్నుండి అనేకమంది దొరసాన్లను చూచాను కాని—యింత ముఖాముఖిగా చూడటం నాకెప్పుడూ తటస్థ పడలేదు.

అనాసకాయిలాంటి ముఖం. పండు మిరపకాయ ల్లాంటి పెదవులు. చలువరాతిలో చెక్కినట్లుగా చేతులు. మెడ వరకు కత్తిరించి వున్న వెంట్రుకలు. జనపనారవలె మెరుస్తూన్న నాలుగు వెంట్రుకలు మాత్రం గుండ్రంగా ముఖం వైపుకు తిరిగివున్నై. ధరించింది కేవలం ఒక మూరన్నర కుళ్ళాయి గుడ్డ—"కుళ్ళాయిగుడ్డ కాదండీ చటర్జీగారూ, దాన్ని 'స్కర్ట్' అంటారు" వినోద బాబు సవరించాడు.

—స్కర్టు గిర్టు నాకేమీ తెలియదు బాబూ—నేను కళ్లార చూచింది. చెప్తున్నా. మనం పరుపులు కుట్టించే గళ్లగుడ్డ వుందే —ఆ గుడ్డ ముక్కే మోకాళ్లపైకి ధరించింది. దానిలో నుంచి ఎర్రని అరటిస్తంభాలవలె రెండుకాళ్లు క్రిందికి దిగి వున్నై. మేజోళ్ళు ధరించింది లేందీ నాకు తెలియలా. యింత వరకు శరీర-యష్టి శబ్దం పుస్తకాల్లోనే చదివాను. యిప్పుడు నేను కళ్ళారా చూచా. నిజంగా అది యష్టే (కర్రే). తలదగ్గరనుంచి రొమ్ము, నడుము, పొట్టవరకు, చిత్రిక పట్టినట్టు సమానంగా వుంది. ఎక్కడకూడ. మెరక పల్లాలు గొగ్గులు గిగ్గులు ఏమీలేవు. 'సంచారిణీ పల్లవి నీలతేవా' కాదు. కాలుతూవున్న అవాయి చువ్వ. చూడగానే భక్తి కుదిరింది. నొసటికి చేయి ఆనించి 'సలామ్ మేమ్ సాహెబా' అన్నాను.

* కిలకిల నవ్వింది. పండు మిరపకాయల సందు నుంచి ముక్కజొన్నగింజవలె కనిపించినై. తల తిప్పుతూ అంది "ఘుడ్ మార్నింగ్.

దొరసాని నృత్యంచేసే అప్సరసవలె చంచలహావ భావం చూపిస్తూ, బెంచీమీదకు వచ్చి కూర్చుంది. నేను కంగారై—కుర్చీ వదలి నిలబడ్డా—"సిడౌన్ బాబూ, భయపడకు" దొరసానంది. దేవిగారి ఒక చేతిలో 'అభయముద్ర,' రెండో చేతిలో 'సిగరెట్టు.' దేవి ప్రసన్నమైంది యింకా నన్నేవరేమి చేస్తారను కొన్నాను. ఇంగ్లీషు బాగారాదు. అందువల్ల ఇంగ్లీషు హిందీకలిసిన భాషలో మనవి చేసుకొన్నా. "బండిలో ఎక్కడా చోటు దొరకలా. అందువల్ల అనధికారంగానే లోన ప్రవేశించాను-కాని గార్డుగారి అనుమతి తీసుకునే. దొరసానిగారు అపరాధం క్షమించాలి."

దొరసాని మరల అభయం యిచ్చింది. నేను తిరిగి కూర్చున్నాను.

కాని అంతటితో నన్నొదలలేదు. దొరసాని నా దగ్గరకొచ్చి కూర్చొని పళ్ళికిలించి రెప్ప వాల్చకుండా నావంక చూడసాగింది.

అరే, యీ కేదారచటర్జీని పాము వెంటబడింది, పులి తరుము కొచ్చింది, భూతం భయపెట్టింది, కొండ ముచ్చు పళ్ళికిలించి కరవొచ్చింది, ప్రాసిక్యూటింగ్ యిన్స్పెక్టరు క్రాసుచేశాడు, కాని యిటువంటి దుర్దశ ఎప్పుడూ కలగలా. ఒకటి అరవైవత్సరాల వయసు-వర్ణం కారు నలుపంటానికి వీలులేదు- పైగా అయిదు రోజులనుండి క్షవరంకూడ చేసుకోలేదు. మొహం కదంబ పుష్పంవలె అయిపోయింది. కాని యీ ఆటంకాలన్నీ కూడ తొలగించుకొని లజ్జ నన్నావరించింది. మొహం వక్కసారిగా వంగపండు రంగైంది.

"ఏమిటి చూస్తున్నారు, దొరసానిగారూ?" నేను ఆగలేక అడిగాను.

దొరసాని పకపక నవ్వింది-"ఏమీలేదు, నో అఫెన్స్. తమ రెవరు బాబూ?"

నా గౌరవానికి భంగం కలిగింది. నేనేం పగటి వేషగాడినా, పశువునా? రొమ్ము విరుచుకుని అన్నా-"ఐ కేదార చటర్జీ, నో జూగార్డెన్."

దొరసాని హీహీ అని నవ్వుతూ అంది-"బెంగాలీ?"

నేను గర్వంగా జవాబిచ్చాను—"యస్ సార్, హైకాస్టు బెంగాలి బ్రాహ్మిన్." జందెం బయటకు తీసి అన్నాను-"సీ?-తమ రెవరు మేడం?"

"ఛీ, చటర్జీగారూ, దొరసాన్ని పరిచయం అడిగారు! ఎటికెట్ వొప్పుకోదు" వినోదుడు తెలియ చెప్పేడు.

"ఏం, ఎందు కడగను? దొరసాని నా పరిచయం తెలుసు కున్నప్పుడు నేనెందుకు వదుల్తాను?"-

దొరసాని కేమాత్రం కోపంరాలేదు, అంతా చెప్పేసింది—పేరు జోన్ జిల్లరు, నివాసస్థానం అమెరికా. యీ దేశం యింతకుముం దనేకసార్లు వచ్చింది. ఇండియా చాల విచిత్రమైన దేశం.

నాకు కొంచెం ధైర్యంవచ్చింది, నేను ఆ యిద్దరు దొరలవైపు చూపిస్తూ "వీరెవరని?" అడిగాను.

దొరసాని చాల నిష్కపటురాలు. బెంచీమీద పండుకునివున్న పొడుగాటి దొరవైపు చూపుడు వ్రేలు చూపిస్తూ చెప్పింది-"దట్ చాప్ యీజ్ టీమతీటోపర్ మకాం కాలిఫోర్నియా, నన్ను పెళ్ళిచేసుకోమంటాడు. యితడు పదికోట్లకు అధికారి-మరి యీ క్రింద పండుకున్నవాడు క్రిస్టఫర్ కొలంబస్ బ్లాటో, వీడుకూడ నన్ను పెళ్ళిచేసుకోవా లంటాడు, వీడిదగ్గరకూడా పది కోట్ల డాలర్లు వున్నై."

"కొలంబస్ అమెరికాను కనిపెట్టాడుకదూ?" నేను సీరియస్‌గా గంభీరంగా ప్రశ్నించాను.

—"వాడు యింకొకడు. వీళ్లు అమెరికాలోనే వుంటున్నారుకాని ఏమీ కనిపెట్టలేక పోయారు. ఆ దేశం నీరసమై పోయింది-'మిథిలేటెడ్ స్పిరిట్' తప్పితే ఏమీ దొరకడంలేదు. అందుకనే వీళ్లు దేశంవదలి 'నిఖాల్సుసరుకు' కోసం ప్రపంచమంతా తిరుగుతున్నారు" దొరసాని అంది.

—"వీళ్లు గొప్ప స్పిరుచువలిస్టులుగా కన్పిస్తున్నారే?" నే నడిగాను.

—"వెరీ" దొరసాని అంది.

యింతలో పొడుగాటి దొర కండ్లుతెరచి నావైపు కోపంగా చూస్తూ పిడికిలి బిగించి అన్నాడు—"యు, యు గెటౌట్ క్విక్" పొట్టివాడుకూడ కాళ్ళు చేతులు క్రింద కొట్టడం సాగించాడు.

నేను నాకర్రను గట్టిగా పట్టుకొని క్రింద టక టక కొట్టసాగాను. దొరసాని బెడ్డుమీదనుంచి తన ఫెదర్ స్లిప్పర్లు తీసుకొని పొడుగాటి వాని రెండు చెంపలు వాయించి ప్రేమతో అంది—"యూహాగ్, యూహాగ్" అంది. పొట్టివానికూడ ఒక తన్నుతన్ని "యూపిగ్, యూపిగ్" అంది. ఇద్దరు అప్పుడే నోరు తెరచుకొని నిద్రపోయారు. దొరసాని వాళ్ళిద్దరి రొమ్ములమీద ఒక్కొక్క స్లిప్పరుపెట్టి తనచోటుకు వచ్చి కూర్చుని, అంది-"భయమేమీ లేదు బాబూ"

నమ్మకం మాత్ర మేమిటి? అరేబియన్ నైట్సులో చదివాను—'ఒక రాక్షసుడు ఒక రాజకుమారిని పెట్టెలో పెట్టి నెత్తిన పెట్టుకొని తిరుగుతూ వుంటం, రాక్షసి పండుకున్నప్పుడు రాజకుమారి వాడి రొమ్ము మీద ఒక కంకరముక్క పెట్టి ప్రపంచంలో వున్న రాజకుమారు లందర్నీ పోగుచేసి వాళ్ళవుంగరాలు కాజేయటం'-ఇక నాకు మూడిందనుకున్నా, యీ దొరసాని ఒకరికి యిద్దరు రాక్షసులమీద ఎక్కి తిరుగుతూంది. యిక తీయొచ్చు, తన తొంభైతొమ్మిది వుంగరాలదండ.

నేను భయపడినంత జరిగింది. నాచేతిని పంచలోహాల వుంగరం వుంది. దొరసాని దానివంక

చూచి—"హౌ లౌలీ! వుంగరం కొంచెం చూడనిస్తారు బాబూ!" అంది.

నేను భయంపడుతూ భయపడుతూ చేయి చాచాను, వ్రేలిని ఆపరేషను చేయించుకో బోతున్నట్లుగా. దొరసాని వెంటనే వుంగరం తీసి తన వ్రేలిని తగిలించుకొని అంది- 'బ్యూటిఫుల్."

శివ, శివ! యిది నేను సంధ్యావార్చుకునే వుంగరం. కిరస్తానీది దాన్ని అపవిత్రం చేసింది! నాకళ్లల్లో నీళ్లు తిరిగినై- "మేం సాహెబ్, తమవద్ద యింకా ఎన్ని వుంగరాలున్నై; నైంటీనైన్?" నేనడిగాను.

దొరసాని బెంచీక్రిందనుంచి ట్రంకుతీసి అందులోనుంచి ఒక విచిత్రమైన పెట్టెను తెరచి నాకు చూపించింది. కళ్లు మిరిమిట్లు గొల్పినై. అందులో చాలా అరలున్నై. ఒకదానిలో కంఠహారంవుంది యింకొకదానిలో యియర్ రింగ్స్. మరోదానిలో యింకోరకం! పాతికముపై వుంగరాలున్న ఒక వుంగరాల ట్రే తీసి నాయెదుటబెట్టి- "మీ కిష్టంవచ్చింది ఒకటి తీసుంకోడి బాబూ" అంది.

"ఎందుకు? నావుంగరం అంతాకలిసి రూపాయి పావులా ఖరీదుచేయదు. యిది మీకు ప్రజంటు చేస్తున్నాను. జాగ్రత్తగా దాచుకోండి. వెరీ హోలీరింగ్" అన్నాను.

"యూ ఓల్డ్ డియర్! నేను మీ ప్రజంటు తీసుకున్నప్పుడు మీరు నాప్రజంటు త్రిప్పివేయకూడదు." అని ఒక రత్నాలు తాపిన వుంగరం తీసి నా వ్రేలిని పెట్టింది.

"థేంక్యూ మేడమ్, నేను నీ దాసుణ్ణి. ఫర్ గెట్ మీ నాట్" అన్నాను. "భయపడొద్దు బ్రాహ్మణ్, యీ వుంగరం నీకోసమే వుంచుతాలే" మనస్సులో అనుకున్నా.

బండి యిటావా వచ్చి ఆగింది. కెల్‌నర్ కంపెనీ ఖాన్‌సామా చా, రొట్టె, వెన్న తీసుకువచ్చి 'టీ హుజూర్?' అన్నాడు. దొరసాని ట్రే అందించింది. తర్వాత నాకర్ర తీసుకొని దొరల్నిద్దరిని లేపుతూ అంది- "గెటప్ టమీ, గెటప్ బ్లాటో." వాళ్లు అడవి పందులవలె గుర్రుపెట్టుతూ ఏదో గొణిగారు. నాకేమీ అర్థం కాలా. వాళ్లింకా లేచి కూర్చునే స్థితిలో లేరని మాత్రం గ్రహించా- "చటర్జీ, మీరు పుచ్చుకుంటారా? పట్టింపేమీ లేదుకదూ?" దొరసాని నన్నడిగింది.

చాల చిక్కులో పడ్డా. ఏంచేసేదీ? కిరస్తానీ స్త్రీ చేతి టీ- కాని కమ్మనివాసన-చలికూడ ఎక్కువగా వుంది. శాస్త్రాల్లో టీ త్రాగకూడదనే నిషేధం ఎక్కడా లేదు, యింతేకాక రైలుబండివంటి బృహత్ కాష్టం మీద కూర్చొని శీతనివారణకై ఔషధార్థం టీ త్రాగినా నిశ్చయంగా "దోషంనాస్తి."

—"మేడమ్ లక్ష్మీ, మీరు స్వయంగా మీ చేతితో టీ యిస్తే ఎందుకు త్రాగనూ? కాని—రొట్టె అక్కరలా" అన్నాను.

టీవల్ల మనోద్వారం తెరుచుకుంటుంది త్రాగుతుంటే అనేక సంగతులు నోటిగుండా వచ్చేస్తై. అశ్వద్ధామ పాలులేక బియ్యపునీళ్ళు త్రాగి ఆనందంచే ఆడుతూ వుండేవాడు. అట్లాగే మన బీదదేశస్తులు కూడటీ, కాఫీలు త్రాగి సారాయి కైపు తెచ్చుకుంటున్నారు. బంకిమచటర్జీకి రోజూ టీత్రాగే అల్వాటు లేదు. పడిశం గడిశం పట్టినప్పుడు కొంచెం పసుపు వుప్పు వేసుకొని త్రాగుతూ వుండేవాడు. అందువల్లే—ఓ బందీ నా ప్రాణేశ్వరా—అని వ్రాశాడు. యిప్పుడు టీ ప్రతాంపంవల్ల భావాల వరద వచ్చేసింది. యింటింటికి చా-యింటింటికి ప్రేమ. ఆ కాలంలో కవులు చాల అవస్థపడుతూవుండేవారు—చంద్రా, మలయానిలా, కోకిలా, వసంతా అంటూ వుంటే పంచశరుడెప్పుడో బయలుదేరేవాడు! యిప్పుడా చిక్కేమీ లేదు. రెండుకప్పులూ రెండుసాసర్లూ-కొద్దిగా ఓటివైనా సరే, ఒక టే బిలూ-జాజిచెక్కతోచేసిందయినా సరే, ఒక టేబిల్ క్లాత్- చిరిగిందయినాసరే, ఒక యువకుడు ఒక యువతి, యిద్దరి మధ్య పొగవిడుస్తూ టీ కెటిల్. అదృష్టంచేత అరవైయేండ్లు గడిచినై- తప్పించుకొని బయట పడ్డా.

—"అయితే దొరసానిగారూ, యీ దొర్లాడే దొర్లిద్దరు నిన్ను పెళ్ళిచేసుకోవా లంటున్నారు గదా- యిందుట్లో ఏ అదృష్టవంతుణ్ణి వరిస్తారు?" దొరసాన్ని అడిగాను.

—"యిదొక్క సమస్యే నేనింతవరకు కేమీ స్థిరం చేసుకోలేదు. 'టిమీ' యోగ్యుడని కాసేపు అనుకుంటాను. దృఢంగా, ఎత్తుగా, అందంగా వుంటాడు. యింతేకాదు నన్ను బాగా ప్రేమించాడు కూడ; కాని మద్యం తాగగానే మెదడు తిరిగిపోతుంది. యీ బ్లాటో వున్నాడే పొట్టిగా లావుగా పుచ్చకాయలా వుంటాడు. ప్రాయంకూడ చాల గడిచింది. కాని నా ఆజ్ఞ జవదాటడు. మనస్సుకూడ చాల మృదువయింది. కాస్త బ్రాంది త్రాగగానే భోరున ఏడుస్తాడు. వృత్తపైత్యపు శరీరం! భలేచిక్కులో వున్నా. యిద్దరు ఒకటేరకం, నన్నెవరూ వదలేటట్టులేరు-యింకా చాలా టైముందిగా, హౌరా చేరకముందే నిశ్చయించుకుంటా కాని చటర్జీగారూ, మీరే చెప్పకూడదూ- యిందులో ఎవర్ని పెళ్ళిచేసుకుంటం మంచిదో" దొరసానడిగింది.

—"మీరు చెప్పినప్రకారం యిద్దరు సుపాత్రులుగానే వున్నారు. కాని వీళ్ళు పడివున్న లక్షణం చూస్తే..." నే నంటున్నాను

—"అదేమీలేదు. కొంచెం సేపట్లో తెలివికి వచ్చేస్తారు. దొరసాని మధ్యలోనే అంది.

—"మీకు ఎవరిమీద పక్షపాతం లేకపోతే మీ తల్లిదండ్రులమీద ఎందుకు వేయకూడదూ యీ భారం?" నే నడిగాను.

—"నాకు తల్లిదండ్రులు లేరు. నాకు నేనే పెద్దను. చూడండి. చటర్జీగారూ, యీభారం మీ మీదే వేసేస్తున్నా. వీళ్లిద్దర్ని బాగా పరీక్షించి, మొగల్సరాయిలో దిగకముందే మీ నిర్ణయం ఏమిటో నాకు చెప్పండి. ఒకరూపాయి ఎగురవేసి చిత్తుబొత్తు చూచి నిశ్చయించు కోవాలనుకున్నా—మీరుండగా ఆ అవుసరంకూడ కనపడటం లేదు" దొరసాని అంది.

చాల గమ్మత్తయిన ఏర్పాటే మాబంధుల పిల్లలకు చాలమందికి సంబంధాలు కుదిర్చాను. కాని యిటువంటి అద్భుతమైన పాత్రలు నాకెప్పుడు దొరకలా. యిద్దరు కోటీశ్వరులు. యిద్దరూ పక్కా త్రాగుబోతులు. పొడుగులో ఒకడు ఎక్కువైతే బరువులో ఒకడు మిగులు. విద్యాబుద్ధుల సంగతి చూద్దామా యింతవరకు గుర్రుపెట్టడం మాత్రం తెలిసింది. ఏట్లో పడనియ్యిపోయి! దొరసానికే, ఆటంకం లేకపోతే నాకేం. యిద్దరిలో ఎవడిపేరో ఒకడిపేరు చెప్పేస్తా. దొరసాని నామాట తీసివేయదని తెలిస్తే..."అమ్మో జుట్టు యిదివరకే తీయించావు. ఆపై పనికాస్తకూడ పూర్తిచేయి. వీళ్ళిద్దరిని చీపురు తీసుకొని కొట్టికొట్టి నరకానికి పంపు" అని చెప్తాను.

మాట్లాడుతూ మాట్లాడుతూ తొమ్మిదిన్నర గడచింది. ముందు ఒక చిన్న స్టేషనులో బండి ఆగుతుంది దొరసాని దొరలుచోటాహాజరీ తీసుకుంటానికి 'రిఫ్రెష్‌మెంటు కారు'లోనికి వెళ్లారు- అప్పుడంత పరీక్ష చేయలేదుగాని, ఇప్పుడు చూస్తే టీ త్రాగిన తర్వాత దొరసాని పెదవులు కొంచెం వెలవెల పోతున్నయి. పక్కారంగు కాదనుకొన్నాను. దొరసాని ఒక బంగారపుడబ్బీ తీసింది. అందులోంచి ఒక యర్రరంగుకణిక, ఒక పౌడరుడబ్బీ తీసింది. కణికను పెదవులమీద రుద్దుకొని, ముక్కుమీద కొంచెం పౌడరువేసి ముఖాన్ని మరమ్మతు చేసుకుంది.

యింతలో బండి ఆగింది.—"చటర్జీ, నేను బ్రేక్‌ఫాస్టు చేయబోతున్నా. టిమీ, బ్లాటో యిక్కడే వుంటారు. కొంచెం కనిపెట్టి వుండాలి, తగువు పెట్టుకు కూర్చుంటారేమో నీవు సర్ద లేకపోతే గొలుసులాగు" దొరసాని అంది.

భలే! ఎటువంటి తేలికపని యిచ్చి పోయింది! ఘంటన్నర తర్వాతగాని కాన్పూరులో బండి ఆగదు. అంతవరకు నేను చచ్చాను! చేతులో కర్రను కొంచెం సర్దుకుని కులదేవతను తల్చుకోసాగేను. పొడుగాటి దొర లేచి కూర్చున్నాడు. ఆవలించాడు, కళ్లు నలుపుకున్నాడు వ్రేళ్లు విరుచుకున్నాడు. నావైపు ఒకసారి కొరకొరచూచి తూలుతూ తూలుతూ బాత్‌రూమ్‌లోకి వెళ్ళాడు.

ఇంతలో పొట్టిదొర కప్పవలె ఎగిరి నాప్రక్కను కూర్చున్నాడు. నేను భయంతో అరవాలనుకుంటూ వుండగానే నాచేయి పట్టుకొని కదలించి—"గుడ్ మార్నింగ్‌సార్ క్రిస్టఫర్ కొలంబస్ బ్లాటోను నేనే" అన్నాడు.

నాకుకొంచెం ధైర్యం వచ్చింది—"సలామ్ హుజూర్" అన్నాను.

—"నావద్ద పదికోట్ల డాలర్లున్నయ్ ప్రతి నిమిషానికి నా ఆదాయం-"

—"తమరు ప్రపంచానికి ప్రభువులు నే నెరుగుదును"

బ్లాటో తన వ్రేలు నారొమ్ముకు ఆనించి అన్నాడు—"లుక్ హియర్ బాబూ, నీకు అయిదు రూపాయలు ప్రజంటుచేస్తా"

—"ఎందుకు స్వామీ?"

—"మిస్ జిల్టరును మీరు వొప్పించాలి. మీ యిద్దరి సంభాషణ నే విన్నాను. మీమీదే అంతా ఆధారపడివుంది. మీ రే పిల్లతరుపువారు. ఆ టీమతీ టోపర్ చాల దుర్మార్గుడు. వాడి ఆసిఅంతా నాదగ్గర తాకట్టుపెట్టాడు. ఉత్త త్రాగుబోతు, పాపరు. వాణ్ని పెళ్లి చేసుకుంటే పాపం మిస్ జిల్టర్ కుళ్ళికుళ్ళి చస్తుంది."



ఇది చెప్పి బ్లాటో వెక్కి వెక్కి ఏడ్వసాగేడు. ఒక బుడ్డిలో కొద్దిగా బ్రాండి దిగుబడివుంది. అది నోట్లోపోసుకొని అన్నాడు- "బాబూ మీరు రెండో జన్మ ఒప్పుకుంటారా?"

"తప్పక."

"నేను క్రిందటి జన్మలో తృషార్తచక్రవాకిని యీ దొరసానుండే నీటిగవ్వ. మా యిద్దరికి ..."

యింతలో బాత్ రూమ్ తలుపు కదిలింది. బ్లాటో నాకు అయిదేళ్లు చూపిస్తూ చటుక్కున తన చోటికిపోయి గుర్రుపెట్టసాగాడు. పొడుగాటి దొర-దొరసాని టిమీ అంటుండే- బాత్ రూమునుంచివచ్చి తన బెంచీమీద తన్నిపట్టుకు కూర్చున్నాడు. బ్లాటో నిద్రనుంచి అప్పుడే లేచినట్టుగా లేచి, ఆవలించి, కళ్లు నలుపుకొని, నావైపు దీనంగా చూస్తూ బాత్ రూంలో దూరబడ్డాడు.

ఇక టిమీవంతు వచ్చింది. బ్లాటో బాత్ రూంకు వెళ్లగానే నా దగ్గరకువచ్చి నాచెయ్యి పట్టుకున్నాడు. నేను ముందుగానే- "గుడ్ మార్నింగ్", అన్నాను.

టిమీ నా వ్రేళ్లు బాగా నలిపి వేయసాగాడు.

"అబ్బా!"

"నీ యెముకలు పిండి చేస్తాను." టిమీ అన్నాడు.

"యస్ సార్" భయపడుతూ భయపడుతూ అన్నాను.

"నిన్ను నలిపి 'జెల్లీ' చేస్తాను."

"యస్ సార్."

"మిస్ జోన్ జిల్టర్ని నేను పెళ్లి చేసుకునే తీర్తాను. నాపేరు చెప్పకపోతే నీ ప్రాణాలకు ఆశ వదులుకో."

"యస్ సార్."

"నా దగ్గర లెక్కలేనంత డబ్బువుంది. ఐదు హొటాల్లు, పది ఓడల కంపెనీలు! పాతిక పందుల కార్ఖానాలు. బ్లాటో దగ్గర ఏముందీ? ఒక సారాబట్టీ! అదికూడ దొంగదే- పెట్టుబడికూడ నాది. బ్లాటో

నిర్భాగ్యుడు, పిచ్చివాడు, త్రాగుబోతు, పొట్టి ముండా..."

బ్లాటో బహుశకోపంతో అంతా వింటూవుండొచ్చు, తలుపు తెరచుకొని బయటకు దూకి టిమ్మీకి గుప్పిట చూపిస్తూ. అరచాడు- "ఎవడు నిర్భాగ్యుడు? త్రాగుబోతెవడు?——"

పాటలు బూతులు హిందీలో బాగా వుంటాయని వాడుక. హిందీ తిట్లలో ప్రసాదిగుణం ఎక్కువ వుంది. యిది వప్పుకోవలసిందే. కాని నిఖాల్సయిన ఉచ్చారణ, దబాయింపు వినాలంటే విదేశపు తిట్లే వినాలి- ముఖ్యంగా అమెరికనులవి. ఒకొక్కక్క శబ్దమేమిటి? ఫిరంగిగుండు అనుకోండి. చెవిలోగుండా పోయి మనస్సును మాడ్చి పారేస్తాయి. ఇంగ్లీషు నాకు బాగారాదు- అన్ని తిట్ల అర్థంకూడ తెలియలేదు- కాని అంతమాత్రంచేత సారం గ్రహించటానికేమీ అడ్డురాలేదు.



"రెండు నిముషాలన్నా కాలేదు, అప్పుడే చేతులు కలిసినవి"

ఒక్క విషయంలో మాత్రం దొరలు మనకంటే బలహీనులని గ్రహించాను.- వాగ్యుద్ధం వాళ్లెక్కువ సేపు చేయలేరు. రెండు నిముషాలన్నా కాలేదు, అప్పుడే చేతులు కలిసినవి. నేను డీల్లపోయి చూస్తూవున్నా. బండి కాన్పూరువచ్చి ఆగింది- యీ సంగతికూడ తెలియదు నాకు.

టకటక లాడుతూ దొరసాని వచ్చేసింది. యీ గజకచ్ఛప యుద్ధం ఆపటం ఆమెకుకూడ సాధ్యమయ్యే పనికాదు- "టిమ్మీ డియర్ డోన్ట్"-బ్లాటో డార్లింగ్ డోన్టు- ప్లీజ్ ప్లీజ్ డోన్ట్" అంది. కాని లాభం లేకపోయింది. వ్యవహారం చెడటంచూచి నేను బండి దిగి పరుగెత్తాను.

ఫస్టు, సెకండు క్లాసులు కాళీగావున్నై. డైనింగు కారులో కూర్చొని అందరు భోంచేస్తున్నారు. ఎవరికి చెప్పేది? చూస్తినిగదా, ఒక దొర తెల్లని ఫ్లానలు సూటు వేసుకొని, ఈలవేస్తూ ప్లాటుఫారంమీద తిరుగుతూ వున్నాడు. నేను రొప్పుతూ రోస్తూ అక్కడకు పరుగెత్తి అన్నాను- "కమ్‌సార్, లేడీ యిన్ డేంజర్." దొర బిగ్గరగా యీల వేసుకొంటూ నావెంట పరుగెత్తుకొచ్చాడు.

మేము వెళ్లేవరకు దొరసాని నాకర్ర తీసికొని ఇద్దరిని పక్షపాతం లేకుండా కొట్టుతూవుంది. వాళ్లేమీ లెఖచేయకుండా కలబడుతూనే వున్నారు. నావెంట వచ్చిన దొర అడిగాడు- "హల్లోజోన్! సంగతేమిటి?" దొరసాని త్వరగా అంతా తెలియచెప్పింది. దొర 'టిమ్మీ' ని 'బ్లాటో' ను సర్దటానికి చూచాడు. కాని వాళ్లు వీడిమీదే తిరగబడ్డారు. యిక క్రొత్తగా వచ్చిన దొర చేయిజారేడు.

అమ్మయ్యో! ముండాకొడుకు నాలుగు గుద్దులకే యిద్దరికీ మిణుగురు పురుగులు మెరుగుడు పువ్వులు చూపించాడు! టిమ్మీ తలకాయ పోయి తలుపుకు కొట్టుకుంది-పాపం వాడక్కడే పడి పోయాడు, యిక బ్లాటో, వీడి స్థితి యింకా హీనమైంది. పేడకుప్పవలె క్రిందపడి బల్లివలె బెంచీకి కరచుకొన్నాడు. తగవు తేలిపోయింది

కొంచెం విశ్రాంతి తీసుకొన్నాక దొరసాని క్రొత్త దొరను నాకు పరిచయంచేసింది- "వీరు సుప్రసిద్ధులైన మిస్టర్ బిల్ బౌండర్, బాక్సింగ్‌లో (ముష్టి యుద్ధంలో) మేటి.

యీాయన మిస్టర్ చటర్జీ, వెరీ డియర్ ఓల్డు ఫ్రెండ్."

దొర నా ముఖం చూస్తూ అన్నాడు- "సమ్ బియర్డ్." దొరసాని అంది- "గడ్డం వుంటే ఏం, మహా దొడ్డ పురుషుడు." దొర నా చేయి పట్టుకొని బాగా వూపి అన్నాడు- "హౌ డుయుడు?

"హౌడూచు? చాలా చలేస్తుంది కాదూ?"

చటుక్కున నా బుర్రలో ఒక ఆలోచన కలిగింది. దొరసానితో మెల్లగా అన్నా- "చూడు మిస్ జోన్, నీవు యింత గడబిడలో పడటం ఎందుకు? టిమ్మీ, బ్లాటో, యిద్దరు యిప్పుడు వశులయ్యారు. నీవు బిల్‌ను ఎందుకు పెళ్లి చేసుకోకూడదు. చాల మంచివాడు-"

"రైటో! నేనిప్పటివరకు యీసంగతే మరచిపోయాను. ఐసే,-బిల్, నన్ను పెళ్లి చేసుకుంటావా?"

"శేదర్! నిన్ను చేసుకోనని ఎవడన్నాడు?..."

రామ! రామ! దొరజాతి చాల సిగ్గులేంది. బిల్‌ని ఆపుతూ నేనన్నాను- "ఆగండి సార్! యిప్పటినుంచే ఏం తొందర? నేనుండగా పిల్ల తరపువాణ్ణి- బ్రైడ్ మాస్టర్! ముందు నీ కులశీలాలు తెలుసుకోవాలి. తర్వాత గాని నాసమ్మతి, యివ్వను."

బిల్ చెప్పసాగాడు- "నా తాత చెప్పులు కుట్టేవాడు. నా తండ్రికూడ చిన్నప్పుడు చెప్పులు కుట్టుతూ వుండేవాడు-"

"యింత మాత్రానికి నీకుల మేమీ తక్కువ కాదు. నీ ఆదాయ మెంత?"

బిల్ కొంచెం సేపు లెఖవేసి చెప్పాడు- "నిమిషానికి పదివేలు- ఘంటకు ఆరులక్షలు! కాని చింతించవలసిన అవసరమేమీ లేదు, మా పిన్ని చచ్చిన తర్వాత నా ఆదాయం యింకా పెరుగుతుంది. ఆమెకు ఒక పాతిక పెద్దపెద్ద చెరువులున్నై వుప్పు నీళ్లవి. అందులో వేల్ (whale) చేపలు గంతు లేస్తూవుంటయి-"

"ఆపేసేయి. యిక ఎక్కువ చెప్పాల్సిన అవసరం లేదు. నే సమ్మతించాను. కాస్త ముందుకురా, ఆశీర్వదిస్తాను. రియల్ హిందూ స్టైల్.

కాని అక్షతలు దర్భలు ఎక్కడున్నై, కిటికీలోగుండా తలపెట్టి కేకేశాను- "ఓకూలీ! త్వరగా కొంచెం గడ్డి పీక్కురా, డబ్బు దొరుకుతుంది.

"యింగ్లీషు ఆశీర్వాదం నాకురాదు- మీాకే ఆటంకం లేకపోతే మాభాషలోనే చెప్తే?." అన్నాను.

"అవశ్యం- అవశ్యం."

దొర నెత్తిమీాద ఒక గుప్పెడు గడ్డిపెట్టి దీవించాను. "చిరంజీవిగా వర్ధిల్లు. ధనము కావలసినంత వుండనేవుంది, పుత్రులుకూడ కలుగుతారు. యిక లక్ష్మిని నేను వప్పగిస్తూనేవున్నా. కాని జాగ్రత్తరా అబ్బాయి, ఎక్కువ సారాయి గీరాయి త్రాగేవు, బ్రహ్మశాపం తగుల్తుంది!" దొర యింకోసారి నాచెయ్యి పట్టుకొని వూగించాడు- నరాలన్నీ జల్లుమన్నాయి.



"అమ్మా లక్ష్మీ నీ పెదవుల సింధూరం అక్షయంగా వుండుగాక"

దొరసాన్ని యిలా దీవించాను- "అమ్మా లక్ష్మీ నీపెదవుల సింధూరం అక్షయంగా వుండుగాక! వీరప్రసవినివి కావలసిన అవుసరం లేదు- యీ ఆశీర్వాదం మా అబలలకే రిజర్వుగా వుండనీ. నీవికమీాద బిడ్డ నల్లవాళ్ల దుఃఖానికి మాత్రం నిమిత్తురాలవు కావద్దు_

యిద్దరు ముగ్గురు వొడుదుడుకు లేని పిల్లల్ని కని సంసారం చక్కగా నడుపుకో."

దొరసాని ఆపళాన ముఖం ఎత్తి, నా అయిదు రోజులనుంచీ గొరగని- సూదులల్లే పొడుచుకొచ్చిన గడ్డం మీద..."

"అరే. ఛీ, ఛీ," వినోదు డన్నాడు.

"ఊ! దేవి చౌధరాణిలో యిలాగే వ్రాసుంది కదూ?"

"సరే చటర్జీ గారూ, పండు మిరపకాయల రుచి ఎట్లావుంది!"

"అందులో కారం ఏమీలేదు. అరే వాళ్ల రివాజే అంత. ఎవరికన్నా భక్తి శ్రద్ధలు చూపించాలంటే యిట్లాగే చేస్తారు. యిందులో పడటం ఎందుకు?

చటర్జీ చెప్పసాగాడు- తర్వాత చూద్దునుగదా, పొడుగు పొట్టి దొర లిద్దరు ముఖము వ్రేలాడేసుకొని దిగి పోతున్నారు- వాళ్ల సామానుకూడ కూలీలు దించివేశారు.



"చేతులు చేతులు కలుపుకొని డాన్సు చేయసాగారు"

బండి కదలింది. బిల్లు జోను, చేతులు చేతులు కలుపుకొని డాన్సుచేయ సాగేరు. నేను నోరు తెరచుకొని చూడసాగాను.

—"చటర్జీ! యిటువంటి ఆనంద దినములో యీమాదిరిగా గ్లూమ్ అయి కూర్చుంటం నాకేమీ బాగుండలా; మా ఢాన్సులో కలువు" జూన్ అంది.

—"మదర్ లక్ష్మీ, నా మోకాళ్ళు వాత నొప్పులచే పట్టుకుపోయాయి. ఎగరవద్దని సలహా" నే నన్నాను.

—"అయితే నీవు పాటన్నా పాడు మేము ఆడుతాము."

ఏం చేస్తా—కిరస్తానీవాళ్ల చేతిలో చిక్క నే చిక్కాను. మువ్వ గోపాలుని పదం ఎత్తుకున్నా.

యీ కాలక్షేపంతో నే మొగల్ సరాయి వచ్చేసింది. కలకత్తా చేరంగానే వాళ్ళు పెళ్లిచేసుకుంటారనీ, మూడు రోజు లున్నాక గ్రాండ్ హొటలులో నన్ను కలిసికొమ్మని దొరసాని మరీమరీ ప్రార్థించింది. మెనీమెనీ షేక్ హేండ్లు రొంబరొంబ సలాములనికూడ చెప్పింది.

తర్వాత నేను కాశీ వెళ్లే బండిలో కూర్చున్నాను! ...... రెండో రోజున కలకత్తా బయలుదేరాను.

"ఏమండీ చటర్జీగారూ, యింటావిడకు యీ సంగతులన్నీ తెలిశాయా లేదా?" వినోద బాబు అడిగాడు.

—"ఏం ఎందుకు తెలియదు? ఒకటి- ఆవిడ పతివ్రత, రెండోది పాపట్లోకూడ మెరసింది. మీ యిప్పటి పిల్లలమాదిరి తెలివి తక్కువదికాదు, అలిగి బిగించుకుంటానికి- యింటికి రాగానే అన్ని సంగతులు చెప్పేశాను."

—"విని ఏంచేసింది?"

—తక్షణమే ఓఢ్రిమంగలిని పిలిపించి అంది- "యీ ముసలయ్యకు గడ్డం గొరుగు, కొంచెం అణచి పట్టి! కిరస్తానీది ఎంగిలిచేసింది" అంది. తర్వాత వుంగరం తీసుకొని గంగాజలంతో కడిగి వ్రేలిని తగిలించుకుంది.

—"పెళ్ళి ధప్పళం ఎట్లావుంది?"

—"అరే, యింకా ఆ ఏడ్పేమి వింటావు? గ్రాండు హొటలుకు వెళ్ళి అడిగితే అక్కడ ఎవ్వరూ లేరని తెలిసింది.-"ఆఁ, వుంటం నిజమే, కాని పెళ్లయిన మర్నాడే పాడుముండ పారిపోయింది. దొరగారు వెతకటానికి వెళ్లారు," అని ఖాన్‌సామా చెప్పాడు.

(హక్కులు అనువాదకునవి.)